RNI No - APTEL/2022/81596

# జనోదయ

కరీంనగర్ గురువారం 05.02.2026 సంపుటి : 03 సంచిక : 63 పేజీలు : 08 వెల : రూ.5

Karimnagar Thursday 05.02.2026 Volume: 03 Issue 63 Pages 08 Cost 5/

తెలుగు దినపత్రిక

## 7,8 తేదీల్లో మోదీ మలేషియా పర్యటన



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 4:** ప్రధాని నరేంద్ర మోదీ ఈ నెల 7,8 తేదీల్లో రెండు రోజుల పాటు మలేషియాలో పర్యటిస్తారు. ఈ సందర్భంగా ఆయన వాణిజ్యం, శక్తి, సముద్ర భద్రత, పెట్టుబడులు తదితర అంశాలపై ఆ దేశంతో ద్వైపాక్షిక ఒప్పందాలు కుదుర్చుకుంటారు.కాగా, ప్రధాని మోదీ మలేషియాను సందర్శించడం ఇది మూడోసారి కాగా, భారత్-మలేషియాల మధ్య 2024 ఆగస్టులో విస్తృత, వ్యూహాత్మక భాగస్వామ్యంపై ద్వైపాక్షిక ఒప్పందం జరిగిన అనంతరం పర్యటించడం మొదటిసారి. శని, ఆదివారం జరిపే పర్యటనలో మోదీ.. మలేషియా ప్రధాని అన్వర్ ఇబ్రహీంతో ద్వైపాక్షిక చర్చలు జరుపుతారని, అక్కడ నివసిస్తున్న భారతీయులు, వాణిజ్య, వ్యాపారవేత్తలతో సమావేశమవుతారని అధికార వర్గాలు వెల్లడించాయి.

# ఫిరాయింపు ఎమ్మెల్యే సంజయ్‌కి క్లీన్‌చిట్

**ఆయన కాంగ్రెస్‌లో చేరినట్టు ఆధారాల్లేవు**

**బీఆర్ఎస్‌లో ఉన్న.. కాంగ్రెస్‌తో పనిచేస్తున్న**

**జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ వెల్లడి**

**స్పీకర్ నిర్ణయంపై సర్వత్రా విస్మయం**

**కడియంపై విచారణ 19కి వాయిదా**

**హైదరాబాద్, ఫిబ్రవరి 4 :** పార్టీ ఫిరాయించిన మరో ఎమ్మెల్యేకు కూడా తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ క్లీన్‌చిట్ ఇచ్చారు. కారు గుర్తుపై బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థిగా జగిత్యాల నియోజకవర్గం నుంచి గెలిచిన ఎమ్మెల్యే సంజయ్ కుమార్ కాంగ్రెస్‌లో చేరినట్టు నిరూపించేందుకు ఆధారాలు లేవని పేర్కొన్నారు. సంజయ్‌కుమార్ ఇప్పటికీ బీఆర్ఎస్ ఎమ్మెల్యేనని తేల్చి చెప్పారు. ఇప్పటికే పార్టీ ఫిరాయింపు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఏడుగురు ఎమ్మెల్యేలు అరికెపూడి గాంధీ, తెల్లం వెంకట్రావు, కాలే యాదయ్య, ప్రకాశ్‌గౌడ్, పోచారం శ్రీనివాస్‌రెడ్డి, గూడెం మహిపాల్‌రెడ్డి, బండ్ల కృష్ణమోహన్‌రెడ్డికి స్పీకర్ క్లీన్‌చిట్ ఇచ్చిన విషయం తెలిసిందే.వీరంతా కూడా కాంగ్రెస్‌లో చేరినట్టు ఆధారాలు లేవంటూ వారిపై బీఆర్ఎస్ ఇచ్చిన పిటిషన్లను కొట్టేశారు. తాజాగా సంజయ్ విషయంలోనూ అదే తీర్పు వెలువరించడంతో స్పీకర్ నిర్ణయంపై సర్వత్రా విస్మయం వ్యక్తమవుతున్నది. కండ్ల ముందు ఆధారాలు కనిపిస్తున్నప్పటికీ వాటిని స్పీకర్ పరిగణనలోకి తీసుకోకపోవడంపై ఆశ్చర్యం వ్యక్తమవుతున్నది. ఫిరాయింపు ఎమ్మెల్యే సంజయ్ స్వయంగా సీఎం ఇంటికి వెళ్లి ఆయన చేతుల మీదుగా కాంగ్రెస్ కండువా కప్పించుకొని పార్టీలో చేరిన విషయం టీవీ చానళ్లు, వార్తా పత్రికల్లో ప్రచురితమైందని, అవి స్పీకర్‌కు కనిపించ లేదా అనే ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి. గత నెల 21న కాంగ్రెస్ పార్టీ ఉమ్మడి నిజామాబాద్‌పై మున్సిపల్ ఎన్నికల సమీక్ష సమావేశాన్ని గాంధీభవన్‌లో నిర్వహించింది. ఈ సమావేశానికి ఎమ్మెల్యే సంజయ్ స్వయంగా హాజరయ్యారు.దీనిపై కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, మాజీ మంత్రి జీవన్‌రెడ్డి తీవ్ర అభ్యంతరం వ్యక్తంచేశారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే కాంగ్రెస్ పార్టీ అంతర్గత సమావేశంలో పాల్గొనడాన్ని నిరసిస్తూ జీవన్‌రెడ్డి ఆ సమావేశాన్ని బహిష్కరించారు. ఇది కూడా స్పీకర్ దృష్టికి రాలేదా? అంటూ పరిశీలకులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలపై స్పీకర్ ఇస్తున్న తీర్పులు రాజ్యాంగాన్ని అపహాస్యం చేయడమేననే రాజకీయ విశ్లేషకులు వ్యాఖ్యానిస్తున్నారు. సంజయ్‌కి స్పీకర్ క్లీన్‌చిట్ ఇచ్చిన కొద్దిసేపటికే ఆయన కాంగ్రెస్ నేతల మధ్య కూర్చొని తాను బీఆర్ఎస్‌లోనే ఉన్నానని చెప్పడం కొసమెరుపు.





**కడియంపై విచారణ 19కి వాయిదా**

మరో ఫిరాయింపు ఎమ్మెల్యే కడియం శ్రీహరిపై విచారణను స్పీకర్ ఈ నెల 19కి వాయిదా వేశారు. మొత్తం 10 మంది ఫిరాయింపు ఎమ్మెల్యేల్లో ఇప్పటివరకు 8 మందికి స్పీకర్ క్లీన్‌చిట్ ఇవ్వగా కడియం శ్రీహరి, దానం నాగేందర్ పిటిషన్లు పెండింగ్‌లో ఉన్నాయి. ఈ ఇద్దరి విషయంలో స్పీకర్ ఎలాంటి తీర్పు ఇస్తారనేది ఉత్కంఠగా మారింది. దానం నాగేందర్ గత ఎంపీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా సికింద్రాబాద్ నుంచి పోటీ చేశారు. ఇక కడియం శ్రీహరి పలుమార్లు తాను కాంగ్రెస్ కోసం పనిచేస్తున్నానని, కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలనే కోరుతానని బహిరంగంగానే ప్రకటించారు. మరి ఈ ఇద్దరిపై స్పీకర్ ఎలాంటి నిర్ణయం తీసుకుంటారోనన్నది ఆసక్తిగా మారింది.

## 6 నుంచి గద్దర్ అవార్డుల స్క్రీనింగ్ : భట్టి



**హైదరాబాద్, ఫిబ్రవరి 4:** ఈనెల 6 నుంచి గద్దర్ సినిమా అవార్డుల స్రీనింగ్ కార్యక్రమం ప్రారంభమవుతుందని, 19న గద్దర్ అవార్డుల ప్రదానోత్సవాన్ని ప్రభుత్వం ఘనంగా నిర్వహిస్తుందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. బుధవారం సెక్రటేరియట్‌లో గద్దర్ సినిమా అవార్డుల జ్యూరీ సభ్యుల సమావేశంలో ఆయన మాట్లాడారు.ప్రతిభ, పారదర్శకతలే ప్రమాణికంగా సినిమా అవార్డుల ఎంపిక ఉంటుందని, గతంలో జ్యూరీ అవార్డుల ఎంపిక గొప్పగా నిర్వహించి అభినందనలు పొందిన విషయాన్ని గుర్తుచేశారు. ఈ సమావేశంలో ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ దిల్‌రాజు, ఐఅండ్‌పీఆర్ కమిషనర్ ప్రియాంక, ఎఫ్‌డీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కిశోర్‌బాబు, సినీ ప్రముఖులు తనికెళ్ల భరణి, కేఎస్ రామారావు, రోజా రమణి, అశోక్‌కుమార్ పాల్గొన్నారు.

## పవన్‌కల్యాణ్ ఏపీకే పరిమితమైతే మంచిది

**టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్**



**హైదరాబాద్, ఫిబ్రవరి 4 :** ఏపీ డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కల్యాణ్ కేవలం ఆంధ్రప్రదేశ్ నాయకుడని.. ఆయన ప్రభావం తెలంగాణలో ఉండదని టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్ పేర్కొన్నారు. ప్రత్యేక తెలంగాణ ఉద్యమ సమయంలో, ఆ తర్వాత కూడా తెలంగాణ ప్రజలను, ఇక్కడి సంస్కృతిని ఉద్దేశించి పవన్‌కల్యాణ్ నీచంగా మాట్లాడారని ఆయన గుర్తుచేశారు. మంగళవారం గాంధీభవన్‌లో మహేశ్‌కుమార్ గౌడ్ విలేకరులతో మాట్లాడుతూ.. పవన్ తెలంగాణ ఆత్మగౌరవాన్ని కించపరిచిన వ్యక్తి.. తెలంగాణ వ్యతిరేకి అని, ఆయన చెబితే ఇక్కడ ఓట్లు వేసే పరిస్థితి లేదని పేర్కొన్నారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను ఎదుర్కోలేక భయపడిన బీజేపీ.. ఉనికి కోసమే పవన్‌కల్యాణ్ శరణు కోరారని మహేశ్‌గౌడ్ విమర్శించారు.


# లోక్‌సభలో ‘పుస్తక’ పోరు!

**సభలో తీవ్ర గందరగోళం**

**స్పీకర్‌కు పరస్పరం ఫిర్యాదులు**

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 4:**

మాజీ సైనికాధిపతి ఎం.ఎం.నరవణే అముద్రిత ఆత్మకథలోని అంశాలు ఇప్పటికే పార్లమెంటును కుదిపేస్తుండగా, ‘బోఫోర్స్’పై ప్రచురించిన పుస్తకాలను అధికార పక్షం ప్రదర్శించడం మరింత కలకలం రేపింది. ఆ పుస్తకాల ఆధారంగా గాంధీల కుటుంబంపై మాట్లాడేందుకు బీజేపీ ఎంపీ నిషికాంత్ దూబేను అనుమతించడంపై కాంగ్రెస్ ఎంపీలు అభ్యంతరం వ్యక్తం చేశారు. స్పీకర్ ఓం ప్రకాశ్ బిర్లాకు తమ నిరసన తెలిపారు. చైనా దురాక్రమణపై నరవణే పుస్తకంలోని భాగాలను ప్రచురించిన ఆర్టికల్‌ను చదువుతానంటూ విపక్ష నేత రాహుల్ గాంధీ పట్టుబట్టడంతో గత రెండురోజులుగా సభ స్తంభించిన విషయం తెలిసిందే. బుధవారం సమావేశాలు మొదలుకాగానే బీజేపీ ఎంపీ దూబే పలు పుస్తకాలను తనతో సభలోకి తెచ్చారు. వాటి పేర్లు చదువుతూ, బోఫోర్సు కుంభకోణం సహా గాంధీల కుటుంబ వ్యవహారాలపై వాటిలో ఏం రాశారనేది మాట్లాడటం మొదలు పెట్టారు. దీంతో సభలో పెద్దఎత్తున గందరగోళం నెలకొంది. 12 గంటలకు సభ తొలిసారి వాయిదా పడింది. ఈ సమయంలో దీపేందర్ సింగ్ హూడా సహా పలువురు కాంగ్రెస్ ఎంపీలు సభాపతి కార్యాలయానికి చేరుకుని, దూబేపై ఓం ప్రకాశ్ బిర్లాకు ఫిర్యాదు చేశారు. దూబేకు మద్దతుగా కేంద్ర మంత్రి కిరెన్ రిజిజు, ఇతర బీజేపీ ఎంపీలు కూడా అక్కడకు చేరుకున్నారు. రాహుల్ తీరుపై వారూ ఫిర్యాదు చేశారు. ఇరువర్గాలూ స్పీకర్ సమక్షంలోనే కొద్దిసేపు వాగ్యుద్ధం సాగించాయి. మధ్యాహ్నం రెండు గంటలకు తిరిగి సభ ప్రారంభం కాగానే, దూబే తిరిగి గాంధీల కుటుంబంపై ప్రస్తావనలు ఉన్న పుస్తకాల్లోని భాగాలను చదవడం ప్రారంభించగా, స్పీకర్ ఆయనను వారించారు. సభా వ్యవహారాలతో నేరుగా సంబంధం లేని పుస్తకాలు లేక వార్తాపత్రికలు లేక ఉత్తరాల్లోని భాగాలను చదవడం నిబంధనల ఉల్లంఘన అవుతుందని, స్పీకర్ దీనిపై ఇప్పటికే నిర్ణయం ప్రకటించారన్నారు. రాష్ట్రపతి ప్రసంగంపై చర్చను మాత్రమే అనుమతిస్తానని స్పష్టం చేశారు. ఆ తర్వాత సభ సాయంత్రం ఐదు గంటల వరకు వాయిదా పడింది. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానానికి సాయంత్రం 5 గంటలకు లోక్‌సభలో జవాబివ్వాల్సిన ప్రధానమంత్రి నరేంద్రమోదీ అసలు సభకే రాలేదు.



సభ 5 గంటలకు సమావేశం కాగానే అధికార పక్ష సభ్యులు వెల్‌లోకి దూసుకువచ్చారు. ఎనిమిది మంది విపక్ష సభ్యులను సస్పెండ్ చేయడానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కాగా, కేంద్రంలోని అగ్ర నాయకత్వం యుద్ధ సమయంలో ప్రతిస్పందించిన తీరు బట్టబయలు అవుతుందనే భయంతోనే రాహుల్‌ను నరవణే పుస్తకంలోని భాగాలను సభలో చదవనీయడం లేదని కాంగ్రెస్ ఎంపీ ప్రియాంకా వాద్రా విమర్శించారు.

## మేడారంలో గ్యాంగ్‌రేప్‌పై

## మహిళా కమిషన్ విచారణ

**సుమోటోగా కేసు స్వీకరణ**



**ములుగు, ఫిబ్రవరి 4:** మేడారం జాతరలో సామూహిక లైంగికదాడి జరిగినట్టు వచ్చిన ఆరోపణలపై జాతీయ మహిళా కమిషన్ (ఎన్సీడబ్ల్యూ) స్పందించింది. ఆ ఘటనను విచారణకు సుమోటోగా స్వీకరించి విచారణకు ఓ కమిటీని ఏర్పాటుచేసింది. ఈ అంశాన్ని అత్యంత తీవ్రమైనదిగా భావిస్తున్నట్టు జాతీయ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ విజయా రాహత్కర్ పేర్కొన్నారు. ఎన్సీడబ్ల్యూ సభ్యురాలు డెలినా ఖోంగ్డప్ కమిటీకి అధ్యక్షత వహించనున్నారు.సీనియర్ కోఆర్డినేటర్ కంచన్ ఖట్టర్ కమిటీ సభ్యురాలిగా వ్యవహరించనున్నారు. అదనంగా ములుగు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ నియమించే ఒక న్యాయవాది ఈ కమిటీకి సహకరించనున్నారు. విచారణ ప్రక్రియ ఈ నెల 5వ తేదీ నుంచి ప్రారంభం కానుంది. ఘటన, గురించి, అధికార యంత్రాంగం తీసుకున్న చర్యలను సమీక్షించడం, విచారించి, వాస్తవాలను నిర్ధారించేందుకు కమిటీ ప్రయత్నించనున్నది. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా నివారణ చర్యలను సూచించడం వంటి బాధ్యతలను కూడా కమిటీకి అప్పగించారు. కమిటీ తన సిఫారసులను తదుపరి చర్యల కోసం జాతీయ మహిళా కమిషన్‌కు సమర్పిస్తుంది.

# భానుడి ఉగ్రరూపం

**సూర్యుడు నుంచి అగ్నిజ్వాలలు**

**భూమివైపు సౌర తుఫానులు**

**కమ్యూనికేషన్, నావిగేషన్ వ్యవస్థలు దెబ్బతినే అవకాశం**

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 4:**

భానుడు గత కొద్దిరోజులుగా ఉగ్రరూపం దాల్చాడని, శక్తిమంతమైన అగ్నిజ్వాలలను కక్కుతున్నాడని ప్రపంచవ్యాప్తంగా ఉన్న అంతరిక్ష సంస్థలు హెచ్చరిస్తున్నాయి. ఈ పరిణామాల కారణంగా సంభవించే రేడియో బ్లాక్ అవుట్ పరిస్థితిని క్షుణ్ణంగా పరిశీలిస్తున్నామని భారత అంతరిక్ష పరిశోధన సంస్థ ఇస్రో తెలిపింది. సూర్యగోళం ఎర్రబడినప్పుడు తీవ్రమైన సౌర తుఫానులు సంభవిస్తాయి. ఇక ఆ తుఫానులు భూగోళం దిశగా సాగితే అంతరిక్షంలో భూమి చుట్టూ తిరుగుతున్న ఉపగ్రహాలు మాడి మసైపోతాయి.టీవీ సిగ్నల్స్‌కు అంతరాయం ఏర్పడుతుంది. రాడార్లు, విద్యుత్తు గ్రిడ్‌లు ప్రభావితమవుతాయి. సూర్య కుటుంబంలో సంభవించిన పరిణామాల నేపథ్యంలో అంతరిక్షంలో క్రియాశీలంగా ఉన్న భారత్‌కు చెందిన 50 ఉపగ్రహాలను అనుక్షణం పరిశీలిస్తున్నామని ఇస్రో అధికారులు తెలిపారు. సౌర తుఫానుల కారణంగా ఈ ఉపగ్రహాలు ప్రభావితమైతే దేశంలో కమ్యూనికేషన్, నావిగేషన్ వ్యవస్థలు దెబ్బతినే అవకాశం ఉంది. ముఖ్యంగా రేడియో బ్లాక్‌అవుట్ ఏర్పడితే విమానాలు, నౌకల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడే పరిస్థితి ఉత్పన్నమవుతుందని ఇస్రో టెలిమెట్రీ విభాగం డైరెక్టర్ అనిల్‌కుమార్ చెప్పారు. ఎక్కడైనా కమ్యూనికేషన్ వ్యవస్థ దెబ్బతింటే వెంటనే దాన్ని మరమ్మతు చేసేందుకు ఏర్పాట్లు చేశామని తెలిపారు. గ్రౌండ్ స్టేషన్లు



ఇప్పటికే మిషన్ కంట్రోల్ కేంద్రాలను అప్రమత్తం చేశాయని, ప్రత్యామ్నాయ ప్రణాళికలు సిద్ధంగా ఉన్నాయని పేర్కొన్నారు.

# ప్రొఫెషనల్ ఫోటో వీడియో గ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షులుగా కనకయ్య గౌడ్

**జనోదయ, మందమర్రి ఫిబ్రవరి 3:**



మంచిర్యాల జిల్లా ప్రొఫెషనల్ ఫోటో అండ్ వీడియో గ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షులుగా కనకయ్య గౌడ్ ను నియమిస్తూ జిల్లా అధ్యక్షులు అప్పాసు రామన్న, ప్రధాన కార్యదర్శి పోతరవేణి శ్వాస తిరుపతి. కోశాధికారి ముక్కెర శ్రీనివాస్‌లు నియామక పత్రం అందజేశారు. బుధవారం జిల్లా కేంద్రం లోని తొల్లవాగు సమీపంలోని ఎస్ కన్వెన్షన్ హాల్ లో జరిగిన జిల్లా కార్యవర్గ సమావేశంలో ఈమేరకు ఆయనను ఏకగ్రీవంగా ఎన్నుకొని నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కాన్సకయ్య గౌడ్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో అసోసియేషన్ జిల్లా కా ర్యవర్గం జిల్లా వ్యవస్థాపక అధ్యక్ష పద వికి ఎంపిక చేశారని వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా జిల్లాలో అసోసి యేషన్ బలోపేతానికి, సభ్యుల సంక్షే మానికి కృషి చేస్తానన్నారు. ప్రభుత్వం నుండి ఫోటో వీడియో గ్రాఫర్లకు సంక్షేమ పథకాలు మంజూరయ్యేలా కృషి చేస్తానన్నారు. ఇదిలా ఉండగా పట్టణానికి చెందిన కనకయ్య గౌడ్ ను జిల్లా ఫోటోగ్రాఫర్స్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షులుగా ఎంపిక చేయడం పట్ల పట్టణ ఫోటో గ్రాఫర్లు వర్షం వ్యక్తం చేస్తూ ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఫోటో గ్రాఫర్స్ అసోసియేషన్ పట్టణ అధ్య క్షులు పసుల వెంకట స్వామి, ప్రధాన కార్యదర్శి ఆడెపు అశోక్ కుమార్, కోశాధికారి బద్రి సతీష్, వలస మణి రాజ్, కామెర గణేష్‌లు పాల్గొన్నారు.

# ఎన్నికల ప్రవర్తనా నియమావళి అనుసరించాలి

**- పెద్దపల్లి అదనపు కలెక్టర్ అరుణ శ్రీ**

**జనోదయ, గోదావరిఖని, ఫిబ్రవరి 04:**



అభ్యర్థులు ఎన్నికల ప్రవర్తనా నియమావళి అనుసరించాలని అదనపు కలెక్టర్ ( స్థానిక సంస్థలు) , రామగుండం నగర పాలక సంస్థ కమిషనర్ జె. అరుణ శ్రీ కోరారు. రామగుండం నగర పాలక సంస్థ ఎన్నికల బరిలో ఉన్న అభ్యర్థులతో ఎన్ టి పి సి , పి టి ఎస్ లోని కాకతీయ కళ్యాణ మండపంలో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికల్లో అనుసరించాల్సిన విధి విధానాలపై ఎన్నికల సంఘం రూపొందించిన హ్యాండ్ బుక్ అభ్యర్థులకు అందజేయడం జరిగిందని అన్నారు. ఈ హ్యాండ్ బుక్ లో పేర్కొన్న నిబంధనలను ఖచ్చితంగా పాటించాలని అన్నారు. సందేహాల నివృత్తి కోసం అభ్యర్థులు రిటర్నింగ్ అధికారులను, రామగుండం నగర పాలక సంస్థ కార్యాలయంలోని ఎలెక్షన్ సెల్ ను సంప్రదించవచ్చని అన్నారు. అన్నారు. ప్రచారంలో ఉపయోగించే వాహనాలకు నగర పాలక సంస్థ నుండి అనుమతి పొందాలని అన్నారు. ఈ అనుమతి పత్రాన్ని వాహనం పై ప్రదర్శించాలని అన్నారు. ఎన్నికల వ్యయ పరిమితి రూ 1.50 లక్షలకు మించరాదని అన్నారు. ఎన్నికల కమిషన్ నిర్దేశించిన రేట్ల ప్రకారం అభ్యర్థి వ్యయం లెక్క కట్టడం జరుగుతుందని అన్నారు.ఎ . సి .పి . ఎం. రమేష్ మాట్లాడుతూ ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణ జరగడానికి అభ్యర్థులు పోలీసులకు తమ వంతు సహకారం అందించాలని కోరారు . మైకులు / లౌడ్ స్పీకర్ లు ఉపయోగిం చుకోవడానికి అనుమతి కోసం మీ సేవా కేంద్రాల్లో ఆన్ లైన్ ద్వారా ధరఖాస్తు చేసుకోవాలని అన్నారు. శాంతి భద్రతల పరిరక్షణ కోసం ర్యాలీలపై కూడా పోలీసులకు ముందస్తు సమాచారం ఇవ్వాలని అన్నారు. నిర్ణీత వేళల్లో నే ప్రచారం చేయాలని అన్నారు. డిప్యూటీ కమిషనర్ నాయిని వెంకట స్వామి మాట్లాడుతూ ఎన్నికల కోడ్ పటిష్టంగా అమలు చేసేందుకు చర్యలు తీసుకుం టున్నామని అన్నారు. తనిఖీలు నిర్వహించడానికి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన బృందాలు కూడా గస్తీ తిరుగుతున్నాయని అన్నారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే నగర పాలక సంస్థ కార్యాలయం కు సమాచారం ఇవ్వాలని అన్నారు. శిక్షకులు స్వరూప్ చంద్ , శ్రీనివాస్‌లు అభ్యర్థులు అనురించాల్సిన ప్రవర్తన నియమావళి పై పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ఇవ్వడంలో పాటు అభ్యర్థుల సందేహాలను నివృత్తి చేశారు. ఈ సమావేశంలో ఎన్నికల పరిశీలకులు పద్మజా రాణి , వ్యయ పరిశీలకులు సుజాత , కృష్ణ మోహన్ , రవి బాబు , నగర పాలక సంస్థ అసిస్టెంట్ కమిషనర్ వేంకటే శ్వర్లు , ఎ సి పి శ్రీహరి , టి పి ఎస్ నవీన్ , సూపరింటెండెంట్ పబ్బాల శ్రీనివాస్ సి ఐ లు ఇంద్రసేనా రెడ్డి , ప్రసాద రావు పాల్గొన్నారు.

# అభ్యర్థులు ఎన్నికల నియమావళిని పాటించాలి

**-సిఐ పర్స రమేష్ -**

**జనోదయ, మందమర్రి ఫిబ్రవరి 3:**

మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులు ఎన్నికల నియమావళిని తప్పకుండా పాటించాలని పట్టణ సీఐ పర్స రమేష్ సూచించారు. క్యాతనపల్లి మున్సిపల్ కార్యాలయంలో బుధవారం పోటీ చేసే అభ్యర్థులకు ఎన్నికల నియమావలిపై అవగాహన కల్పించారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున ఓటర్లను డబ్బులు, మద్యం తో ప్రలోభ గురి చేయరాదని స్పష్టం చేశారు. పట్టణంలో ఎలాంటి అవాంఛ నీయ సంఘటనలు జరుగకూడదని, సామాజిక మాధ్యమాలలో కించపరిచే విధంగా పోస్టులు పెట్టవద్దని హెచ్చ రించారు. ఇలాంటి చర్యలు తమ దృష్టికి వచ్చిన వెంటనే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చ రించారు. ఎవరైనా మద్యం అమ్మిన లేదా పట్టుబడిన వారిపై చట్ట పరమైన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. ప్రశా



ంతంగా, శాంతియుత వాతావరణం లో పోలింగ్ జరిగేలా అభ్యర్థులు అందరూ సహకరించాలని కోరారు. ఈ కార్య క్రమంలో మున్సిపల్ ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

# ఇంటింటి ప్రచారంలో మాజీ ఎమ్మెల్యే



**జనోదయ, బెల్లంపల్లి, ఫిబ్రవరి 4:**

బెల్లంపల్లి పట్టణంలో బుధవారం నుండి మున్సిపల్ ఎన్నికల ప్రచార పర్వం ప్రారంభమైంది. మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య మొదటి రోజు వార్డుల్లో తిరిగి బి ఆర్ ఎస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. 2,31 వార్డుల్లో పోటీ చేస్తున్న అభ్యర్థుల కోసం ఆయన ప్రచారం చేశారు. మున్సిపల్ ఎన్నికల్లో బీ ఆర్ ఎస్ పార్టీని గెలిపిస్తే వార్డుల్లో ప్రజా సమస్యలపై అలుపెరుగని పోరాటం చేస్తుందని ఆయన చెప్పారు. ప్రచారంలో ఆ పార్టీ నాయకులు నూనేటి సత్యనారాయణ, సబ్బని కృష్ణతో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### ఈనెల 6న సీఎం కప్ 2 వ ఎడిషన్

# క్రీడా పోటీలు ప్రారంభం

**జనోదయ, బెల్లంపల్లి, ఫిబ్రవరి 4:**

ఈనెల 6న లంబడి తండా గురుకుల పాఠశాల క్రీడా మైదానంలో ఉదయం 9 గంటలకు సీఎం కప్ 2 వ ఎడిషన్‌ని యోజకవర్గ స్థాయి పోటీలను నిర్వహిస్తున్నట్లు బెల్లంపల్లి ఎంపీడీవో ఆర్. మహేందర్ తెలిపారు. ఈ పోటీల్లో బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ (చైర్మన్), ఎం ఈవో పోచయ్య (కన్వీనర్)లు పాల్గొంటున్నట్లు తెలిపారు. క్రీడల నిర్వహణ కోసం ఫిజికల్ డైరెక్టర్ బండి రవిని సమన్వయకర్తగా నిర్వహించినట్లు తెలిపారు. క్రీడాకారులు తమ రిజిస్ట్రేషన్లు, ఇతర వివరాలకు 8639965839 నెంబర్‌లో సంప్రదించాలని కోరారు. గ్రామీణ ప్రాంతాల్లోని యువతలో దాగి ఉన్న క్రీడా నైపుణ్యాన్ని గుర్తించి, వారికి సరైన వేదిక కల్పించేందుకే ఈ పోటీలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. నియోజకవర్గంలోని క్రీడాకారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ క్రీడా స్ఫూర్తిని చాటాలని కోరారు. ఈ పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు నిర్ణీత సమయానికి రిపోర్టింగ్ చేయాలన్నారు.

### హుజురాబాద్‌లో

# బిఆర్ఎస్‌కు షాక్!

**కాంగ్రెస్‌లో చేరిన 30వ వార్డు అధ్యక్షుడు మధుకర్ రావు, మరియు దిల్ శ్రీనివాస్**



**జనోదయ, హుజురాబాద్ ఫిబ్రవరి 04**

హుజురాబాద్ నియోజకవర్గ కేంద్రంలో బిఆర్ఎస్ పార్టీకి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. పట్టణంలోని 30వ వార్డు బిఆర్ఎస్ అధ్యక్షుడు కేసరి మధుకర్ రావు మరియు దిల్ శ్రీనివాస్ తో పాటు తన అనుచరులతో కలిసి కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. మాజీ కౌన్సిలర్ తోట రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జ్ వొడితల ప్రణవ్ వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా కేసరి మధుకర్ రావు మాట్లాడుతూ ... వార్డు ప్రజలకు మెరుగైన సేవలందించడానికి, అభివృద్ధి పనులను వేగవంతం చేయడానికే అధికార కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు ప్రకటించారు. రాబోయే ఎన్నికల్లో 30వ వార్డు కాంగ్రెస్ కౌన్సిలర్ అభ్యర్థి రొంటాల సుహాసినిని భారీ మెజారిటీతో గెలిపించుకుంటామని ఆయన ధీమా వ్యక్తం చేశారు.